ఉష్ణోగ్రత : గరిష్ఠం 40.4 కనిష్ఠం 14.7

రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:32 (మంగళవారం సాయంత్రం)
సహర్: 5:00 (బుధవారం ఉదయం)

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద పనులు చేస్తున్న కూలీలకు కనీస వసతులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భానుడు భగ్గుమంటుండటంతో పని ప్రాంతాల్లో అల్లాడిపోతున్నారు. ఉదయం 9 గంటల నుంచి తీవ్రమైన ఎండ వేడిమి, ఉక్కపోతతో కూలీల పరిస్థితి దయనీయంగా మారింది. తాగేందుకు నీరు దొరక్క నిలువ నీడ లేక విలవిల్లాడుతున్నారు. ప్రమాదవశాత్తు గాయమైతే ప్రథమ చికిత్స కిట్లు కూడా అందుబాటులో ఉండటం లేవు. గతంలో ప్రభుత్వం కూలీలు సేద తీరేందుకు నీడ కోసం టెంట్లు, మెడికల్ కిట్లు పంపిణీ చేసేది. వీటిని కొన్నేళ్లుగా ఇవ్వడం కేంద్ర ప్రభుత్వం నిలిపివేయడంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి' నిర్వహించిన క్షేత్రస్థాయి విజిట్‌లో విస్తుపోయే విషయాలు వెలుగుచూశాయి.


ఇబ్రహీంపట్నం నల్లకంచెలో ఊట చెరువులో కొనసాగుతున్న పనులు

ఆంధ్రజ్యోతి విజిట్

నీడ లేదు.. నీళ్లు లేవు!

- రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- అవస్థలు పడుతున్న కూలీలు
- మూడేళ్లుగా అందని సమ్మర్ అలవెన్స్
- జిల్లాలో ఏటేటా తగ్గుతున్న కూలీల సంఖ్య
- ఫీల్డ్ అసిస్టెంట్లకు మూడు నెలలుగా వేతనాల్లేవ్

ఉపాధి పని ప్రదేశాల్లో వసతులు కరువు

ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఉపాధి హామీ పనులు చేసే కూలీల అవస్థలు గురించి పట్టించుకునే నాథుడే లేడు. వేసవిలో చెల్లించే అదనపు భత్యం మూడేళ్లుగా నిలిచిపోయింది. సాధారణంగా కూలీలకు చెల్లించే వేతనానికి మరికొంత మొత్తాన్ని అదనంగా చెల్లించేవారు. మూడేళ్ల క్రితం కొత్తగా సాఫ్ట్‌వేర్ అందుబాటులోకి రావడంతో అప్పటి నుంచి ఉపాధి కూలీలకు సమ్మర్ అలవెన్స్ రావడం లేదు. ఫిబ్రవరి నెలలో 20 శాతం, మార్చిలో 25 శాతం, ఏప్రిల్, మే నెలలో 30 శాతం, జూన్‌లో 25 శాతం అదనంగా భత్యంగా చెల్లించేవారు. అదనపు భత్యం ఇచ్చినప్పుడు కూలీల సంఖ్య ఎక్కువగా ఉండేది. మూడేళ్లుగా నిలిపివేయడంతో ఏటేటా కూలీల సంఖ్య తగ్గుముఖం పట్టింది. ఆమనగల్లు మండలంలో 4,200 జాబ్ కార్డులకు గాను 936 మంది కూలీలు పనిచేస్తున్నారు. ఎండల నేపథ్యంలో కూలీల సంఖ్య రోజురోజుకూ తగ్గుతుంది. సాఫ్ట్‌వేర్ మారడంతో

మిగతా 8వ పేజీలో...

ఉపాధి పనుల వివరాలు

సంవత్సరం	కల్పించాల్సినవి	కల్పించినవి	శాతం	పనిచేసిన కుటుంబాలు	వంద రోజులు పూర్తి చేసినవి
2024-25	36.79	18.33	50	51,186	1,106

ఎండకు ఇబ్బంది పడుతున్నాం

ఎండకు మాడిపోతున్నాం. పనిచేసే చోట ఎలాంటి నీడ లేదు. కనీసం తాగేందుకు నీరు కూడ లేదు. కూలీలను పట్టించుకునే వారే కరువయ్యారు. 15 రోజులకు ఒకసారి కూలీ డబ్బులు వస్తున్నాయి. ప్రభుత్వం కూలీలకు కావాల్సిన సౌకర్యాలు కల్పించాలి.

పి. యాదయ్య, ముద్దెంగూడ, షాబాద్ మండలం

వసతుల కల్పనకు చర్యలు

ఉపాధి హామీ కూలీలు పనిచేసే చోట తాగునీరు, టెంటు గ్రామ పంచాయతీల ద్వారా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాను. మూడేళ్ల నుంచి సమ్మర్ అలవెన్స్ రావడం లేదు. ఈ విషయాన్ని ఇటీవల జిల్లా పర్యటనకు వచ్చిన ఈజీఎస్ కేంద్ర బృందం సభ్యులకు వివరించడం జరిగింది. పనిలేని వారికి పని కల్పిస్తున్నాం.

- శ్రీలత, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి

గళం విప్పిన ఎమ్మెల్యేలు

పార్టీలకతీతంగా బీసీ బిల్లును ఆమోదించాలి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



షాద్‌నగర్ అర్బన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన బీసీ బిల్లును పార్టీలకతీతంగా ఆమోదించాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ కోరారు. సోమవారం అసెంబ్లీలో ఆయన దీనిపై మాట్లాడారు. దేశ చరిత్రలోనే ప్రప్రథమంగా బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలనే ఉద్దేశంతో సీఎం రేవంత్‌రెడ్డి బీసీ బిల్లును ప్రవేశ పెట్టడం సంతోషకరమన్నారు. ప్రజా సంఘాలు ఎన్ని పోరాటాలు చేసినా బీసీలకు న్యాయం జరగలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు రాహుల్‌గాంధీ ఆలోచన మేరకు రేవంత్ ప్రవేశపెట్టిన బిల్లును అన్ని పార్టీలలోని బీసీ నాయకులు ఆమోదం తెలపాలని కోరారు. ఈ బిల్లును ఆమోదిస్తే విద్య, ఉద్యోగం, రాజకీయ రంగాల్లో బీసీలు రాణించి ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందుతారన్నారు. బీసీ బిల్లుకు చట్టబద్ధత కల్పిస్తున్న సీఎం, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఎమ్మెల్యే వీర్లపల్లి కృతజ్ఞతలు తెలిపారు.

అసంపూర్తి రోడ్డు నిర్మాణానికి అటవీ శాఖ అనుమతి ఇప్పించాలి

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి



ఆమనగల్లు, మార్చి17(ఆంధ్రజ్యోతి): కడ్తాల్ - తలకొండపల్లి ప్రధాన రహదారిలో వెంకటాపూర్ గేటు వద్ద అసంపూర్తిగా నిలిచిపోయిన బీటీ రోడ్డు నిర్మాణానికి అటవీ శాఖ అనుమతి ఇప్పించాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి కోరారు. సోమవారం అసెంబ్లీలో జీరో అవర్‌లో ఈ విషయాన్ని ఆయన ప్రస్తావించారు. మూడేళ్ల క్రితం కడ్తాల నుంచి తలకొండపల్లి చౌరస్తా వరకు డబుల్ రోడ్డుగా విస్తరించడం జరిగిందని తెలిపారు. కాగా అటవీ శాఖ అభ్యంతరంతో వెంకటాపూర్ గేటు సమీపంలో 1.55 కిలోమీటర్ల రోడ్డు విస్తరణ నిలిచిపోయింది. రోడ్డు విస్తరణకు అటవీ శాఖకు అనేకమార్లు నివేదించడం జరిగిందని తెలిపారు. ఇప్పటి వరకు వారి నుంచి అనుమతి రాలేదని కసిరెడ్డి పేర్కొన్నారు. రంగారెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లాలను కలిపే ప్రధాన రహదారి కిలోమీటర్‌న్నర సింగిల్‌గా ఉండటంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ప్రస్తావించారు. అటవీ శాఖ నుంచి అనుమతి ఇప్పించి అసంపూర్తి రోడ్డును పూర్తిచేసి రాకపోకలకు ఇబ్బందులు తీర్చాలని ఎమ్మెల్యే కోరారు. సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని ఆర్అండ్‌బీ శాఖ మంత్రి కోమటి వెంకటేశ్‌రెడ్డి, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖలు సమాధానం ఇచ్చారు.

ఐ ఫోన్ల స్మగ్లింగ్..

- ఐదుగురు మహిళల అరెస్టు
- 10 సెల్‌ఫోన్ల సీజ్


ఐఫోన్లను సీజ్ చేస్తున్న డీసీపీ

శంషాబాద్ రూరల్, మార్చి 17, (ఆంధ్రజ్యోతి) : ఐఫోన్లను స్మగ్లింగ్ చేస్తూ పట్టుబడిన ఐదుగురు మహిళా ప్రయాణికులను శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఎయిర్‌పోర్టు ఔట్‌పోస్టు పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ఈ ఘటన ఆర్జీఐఏ ఔట్‌పోస్టు పోలీస్‌స్టేషన్‌లో జరిగింది. డీసీపీ రాజేశ్ తెలిపిన వివరాల ప్రకారం... హైదరాబాద్‌కు చెందిన రిజ్వాన బేగం (37), సబఖాన్నం, (25), ఓమర్ బేగం (60), సురియా ఖాన్నం (55), లాయి ఉన్నీసా (55) ఐదుగురు కలిసి రసూల్ ఏ1క్రైమా (యూఏఈ) నుంచి 6 ఈ1496 విమానంలో సోమవారం ఉదయం 7.30 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు ఈక్రమంలో విమానాశ్రయంలో కస్టమ్స్, సీఐ జె.బాల్‌రాజ్ సిబ్బందితో కలిసి బ్యాగులు తనిఖీ చేశారు. అందులో విలువైన 10 ఐఫోన్లు (ఐఫోన్ 16 ప్రొమ్యాక్స్, గోల్డ్ కలర్)కు సంబంధించి ఎలాంటి పత్రాలు లేకపోవడంతో అదుపులోకి తీసుకుని విచారించారు. ట్యాక్స్‌లు ఎగ్గొట్టడానికి వీరు స్మగ్లింగ్ చేస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. పట్టుబడిన ఫోన్ల విలువ దాదాపు రూ. 13లక్షల వరకు ఉంటుందని, వాటిని సీజ్ చేశామని నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు డీసీపీ తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రామ్‌కుమార్, ఏసీపీ కె. శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

విమానంలో యువకుడి హల్‌చల్

- టేకాఫ్ అవుతుండగా

అత్యవసర డోర్ తెరవడానికి యత్నం.. కేసు నమోదు

శంషాబాద్ రూరల్, మార్చి17 (ఆంధ్రజ్యోతి): ఇండిగో విమానంలో ఓ యువకుడు హల్‌చల్ సృష్టించిన సంఘటన ఆదివారం శంషాబాద్ ఎయిర్‌పోర్టు ఔట్‌పోస్టు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి వారణాసి వెళ్తున్న 6ఈ 6719 ఇండిగో విమానం సాయంత్రం 4.18 గంటలకు టేకాఫ్ తీసుకుంటున్న సమయంలో సౌరవ్‌కుమార్ చల్బే(26) ఎమర్జెన్సీ డోర్ తెరవడానికి యత్నించగా, అది గమనించిన ఎయిర్‌లైన్స్ సిబ్బంది అడ్డుకున్నారు. దీంతో అతను ఎయిర్‌లైన్స్ అధికారులతో వాగ్వాదానికి దిగాడు. టేకాఫ్ తీసుకుంటున్న విమానం ఆగిన తర్వాత ఎయిర్‌పోర్టు పోలీసులకు సమాచారం అందించగా యువకుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. విమానంలో గాల్లో ఉండి ఉంటే పెను ప్రమాదం జరిగేదని ఎయిర్‌లైన్స్ అధికారులు చెప్పారు. న్యూసెన్స్ కింద కేసు నమోదు చేశామని సీఐ బాల్‌రాజ్ తెలిపారు. నిందితుడు బిహార్‌కు చెందిన యువకుడిగా నిర్ధారించారు. హైదరాబాద్‌లో చదువుకుంటున్నట్లు పోలీసులు చెప్పారు.

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలి

కలెక్టరేట్ ఎదుట ఆందోళన


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

రంగారెడ్డి అర్బన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : వేతనాలు ప్రతి నెలా 1వ తేదీన చెల్లించాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా కార్యదర్శి కవిత డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీఎంశ్రీ పథకాన్ని రద్దు చేయాలని, ఈ నిధులను ఐసీడీఎస్‌లకు కేటాయించాలని డిమాండ్ చేశారు. మొబైల్ అంగన్‌వాడీ సెంటర్లను రద్దు చేసి, ఐసీడీఎస్ సేవలను పాత పద్ధతిలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన నూతన జాతీయ విద్యావిధానం చట్టాన్ని అమలు చేసే ప్రయత్నం తక్షణమే ఉపసంహరించుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పొందుపర్చిన హామీల ప్రకారం రూ.18 వేలు వేతనం ఇవ్వాలన్నారు. మినీ నుంచి మెయిన్ అయిన 4 వేల మంది అంగన్‌వాడీ టీచర్లకు 10 నెలల బకాయి వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మంత్రి సీతక్క ఇచ్చిన హామీ ప్రకారం రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్లకు రూ.2లక్షలు, హెల్పర్లకు వీఆర్ఎస్ సౌకర్యం కల్పించాలన్నారు. ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. 24 రోజుల సమ్మె కాలం వేతనాలు ఇవ్వాలన్నారు. 2వ పీఆర్సీ ప్రకారం 5 శాతం ఐఆర్‌ను వెంటనే వర్తింప చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

బీజేపీ రూరల్ జిల్లా అధ్యక్షుడిగా

రాజ్‌భూపాల్‌గౌడ్



7

ఎండిన వరి పంట

పశువులకు మేతగా పైరు 7

ప్రజావాణి అర్జీలను పెండింగ్‌లో పెట్టొద్దు

అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్



కంటి అద్దాలను పంపిణీ చేస్తున్న అదనపు కలెక్టర్

రంగారెడ్డి అర్బన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణి అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి ఆమె ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 72 ఫిర్యాదులు వచ్చాయని పేర్కొన్నారు. ఇందులో రెవెన్యూశాఖ నుంచి 40, ఇతర శాఖల నుంచి 32 ఫిర్యాదులు అందాయని తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్లు, మున్సిపల్ అధికారులు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి అద్దాల పంపిణీ

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమగ్ర కంటి పరీక్ష, ఉచిత అద్దాల పంపిణీ కార్యక్రమంలో భాగంగా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ విద్యార్థులకు ఐ గ్లాసెస్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం


కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

తలకొండపల్లి, మార్చి17(ఆంధ్రజ్యోతి): మండల పరిధి దేవుని పడకల్ గ్రామంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం తిరుకల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా నిర్వహించిన కల్యాణానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ వేడుకకు కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యేలు వంశీచంద్ రెడ్డి, జైపాల్ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆలయ అనువంశిక ధర్మకర్త లట్టుపల్లి రాజ్‌కుమార్ రెడ్డి, ఈవో స్నేహలత ఆధ్వర్యంలో అర్చకులు రామాచార్యులు, పద్మనాభాచార్యులు, రామానుజాచార్యులు, శ్రీనివాసాచార్యులు, గోపాలచార్యులు, మేళతాళాలు, వేద మంత్రాల నడుమ స్వామివారి పరిణయ తంతును కనుల పండువగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో స్నేహలత, టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ్మ, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహ్మారెడ్డి పాల్గొన్నారు.

కడ్తాల్, మార్చి 17(ఆంధ్రజ్యోతి):రాజీవ్ యువ వికాసం పథకం నిరుద్యోగ యువత ఉద్యోగ, ఉపాధికి దోహదపడుతుందని పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. యువత ఉపాధి కోసం సీఎం రేవంత్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. అసెంబ్లీ ప్రాంగణంలో సీఎం రేవంత్ రెడ్డి నిరుద్యోగ యువతు









ఉపాధి కోసం 'రాజీవ్ యువ వికాసం'

స్వయం ఉపాధి కల్పించడానికి రాజీవ్ యువ వికాస పథకాన్ని ప్రారంభించడం హర్షణీయమని శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. కడ్తాలలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఈ పథకంతో 5లక్షల మందికి స్వయం ఉపాధి కోసం రూ.6వేల కోట్ల సబ్సిడీ రుణాలను ప్రభుత్వం ఇస్తుందని చెప్పారు. ఒక్కో లబ్ధిదారుకు రూ.4లక్షల రుణ ఇస్తారని, ఇందులో 60-80శాతం వరకు రాయితీ ఇస్తారని తెలిపారు. రాజీవ్ యువ వికాస పథకంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ యువత జీవితాల్లో వెలుగు నిండడం ఖాయమన్నారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి జి.శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు బిక్యానాయక్, యాట నర్సింహ, బిచ్యానాయక్, వెంకటేశ్, మల్లేశ్‌గౌడ్, హీరాసింగ్, జవహర్‌లాల్, తులసీరామ్, రవి, రాజేశ్, లక్ష్మయ్య ఉన్నారు.

కార్తీక్‌రెడ్డిని కలిసిన జయసింహ

శంషాబాద్ రూరల్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కార్తీక్‌రెడ్డిని సోమవారం రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని శంషాబాద్ మున్సిపాలిటీకి చెందిన రాచమల్ల జయసింహ మర్యాదపూర్వకంగా కలిశారు. గత ఎన్నికల్లో బీఎస్పీ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసిన కార్తీక్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సన్మానించారు. బీఎస్పీ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పార్టీని వీడి బీఆర్ఎస్‌లో చేరడంతో జయసింహ సైలెంట్‌గా ఉండిపోయారు. కార్తీక్‌రెడ్డి మాట్లాడుతూ.. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పటిష్టతకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పవిత్రసాగర్, భాస్కర్, రాచమల్ల రాజ్‌కుమార్, సందీప్, శ్రవణ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

మాడ్గుల, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని అందుగుల గ్రామానికి చెందిన కొప్పుల మహేష్ అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నాడు. ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డి సహకారంతో మంజూరైన రూ.42వేల చెక్కును సోమవారం ప్యాక్స్ డైరెక్టర్ జగన్, మాజీ సర్పంచ్ జయలక్ష్మీ రాజు అందజేశారు. శ్రీనివాస్, రమేశ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కందుకూరులో..

కందుకూరు: మండలంలోని అగర్‌మియాగూడకు చెందిన సునీతకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కును మాజీ ఉప సర్పంచ్ రేవంత్ రెడ్డి అందజేశారు. ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి చొరవతో రూ.60వేలు మంజూరయ్యాయని తెలిపారు.

రిజర్వాయర్‌కు నిధులు కేటాయించండి

షాద్‌నగర్ అర్బన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించాల్సిన లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌కు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని పాలమూరు అధ్యయన వేదిక రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కర్ణకోట రవీంద్రనాథ్ డిమాండ్ చేశారు. సోమవారం మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బడ్జెట్‌లో లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణానికి అవసరమయ్యే నిధులు కేటాయించి, పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న అశోక్

మేడ్చల్ ప్రతినిధి, మార్చి 17(ఆంధ్రజ్యోతి):కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అశోక్ డిమాండ్ చేశారు. సోమవారం మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీ టీచర్స్ హెల్పర్స్ యూనియన్ పిలుపు మేరకు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ విధానాలతో ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేయ చూస్తోందని ఆరోపించారు. ఈ విధానాలకు వ్యతిరేకించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సునిత, శోభారాణి, సీఐటీయూ కార్యదర్శి చంద్రశేఖర్, కిష్టప్ప, శ్రీనివాసులు, లింగస్వామి, వెంకన్న, గణేష్, ఉన్ని కృష్ణ, శివరాణి, శైలజ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మల్లన్న కల్యాణోత్సవం

మేడ్చల్ టౌన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలో మల్లికార్జున స్వామి(మల్లన్న) కల్యాణ మహోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్దఎత్తున వేడుకల్లో పాల్గొని పూజలు నిర్వహించారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేష్ యాదవ్ పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. అదేవిధంగా అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వేముల శ్రీనివాస్‌రెడ్డి, మర్రి నర్సింహారెడ్డి, శంకర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు


కబిచంద్ర

కీసర రూరల్, మార్చి17(ఆంధ్రజ్యోతి): హత్య కేసులో నిందితుడికి జీవత ఖైదు విధిస్తూ సోమవారం కోర్టు తీర్పిచ్చింది. కీసర ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. గోధుమకుంటలో ష్యూర్ ఫీడ్ సెంటర్ కొనసాగుతోంది. అందులో ఒడిశాకు చెందిన బబ్లూ బడానాయక్, కబిచంద్ర కూలీలుగా పనిచేస్తున్నారు. పని విషయంలో బబ్లూ, కబిచంద్రల మధ్య గొడవలొస్తుండేవి. 2024 మార్చి 10న కోడి పిల్లల దిగుమతిలో వారిద్దరి మధ్య పేచీ వచ్చింది. దీంతో కక్షపెంచుకున్న కబిచంద్ర అదేరోజు మద్యం తాగి బబ్లూ ఇంటికి వెళ్లి గొడవపడ్డాడు. తనతో తెచ్చుకున్న కత్తితో బబ్లూను పొడిచాడు. తీవ్ర గాయాలైన బబ్లూను స్థానికులు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బబ్లూ కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేశారు. ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య కోర్టుకు సాక్ష్యాధారాలను సమర్పించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ యాదగిరి కేసు వాదించారు. విచారణ అనంతరం మల్కాజ్గిరి కోర్టు జడ్జి బాలభాస్కర్ కబిచంద్రకు జీవిత ఖైదు, వెయ్యి రూపాయల జరిమానా విధించారు. వేగవంతంగా కేసు విచారణ చేపట్టి నిందితుడికి శిక్షపడేలా చేసిన పోలీసు అధికారులను రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు అభినందించారు.















సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి

తాండూరు రూరల్,మార్చి17(ఆంధ్రజ్యోతి): సమాజంలో జరుగుతున్న నేరాలను, నేరస్తులను గుర్తించేందుకు సీసీ కెమెరాలు ఉపయోగపడతాయని వికారాబాద్ జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. సోమవారం కరన్‌కోట్ పోలీసుస్టేషన్‌లో అదానీ సిమెంట్ కంపెనీ అందజేసిన సీసీ కెమెరాలు, కరన్‌కోట్ ఎస్‌బీఐ మేనేజర్ అందజేసిన బారికేడ్లను ఎస్ఐ కె.విఠల్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ.. ఒక్క సీసీ కెమెరా వందమంది పోలీసులు, వెయ్యి కళ్లతో సమానమన్నారు. కెమెరాల ఫుటేజీలను ఎవరూ మార్చలేరన్నారు. అదానీ కంపెనీ సోషల్ రెస్పాన్స్‌బిలిటీ కింద సీసీ కెమెరాలు అందంజేయడం గొప్ప విషయం అన్నారు. అలాగే సమీప గ్రామాల్లో సిమెంట్స్ కంపెనీ యాజమాన్యం, గ్రామాల ప్రతినిధుల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్నారన్నారు. కొందరు కోట్లాది రూపాయలు వెచ్చించి ఇళ్లు నిర్మించుకున్నా సీసీ కెమెరాలు మాత్రం ఏర్పాటు చేసుకోవడం లేన్నారు. సొంతిళ్లు, పంచాయతీలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. డీఎస్పీ బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. తాండూరు ప్రాంతంలో అదానీ సిమెంట్స్, అల్ట్రాటెక్ సిమెంట్స్ వారు సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించడం అభినందనీయమన్నారు. సీసీ కెమెరాల వల్లే ఇక్కడ గతంలో బాలిక అదృశ్యం, బాలుడి అపహరణ, లారీ ఢీకొట్టిన సంఘటన వంటి కేసునుల ఛేదించామని చెప్పారు. మాజీ ఎంపీటీసీ నరేందర్‌రెడ్డి(సాయిరెడ్డి) కెమెరాల ఏర్పాటుకు రూ.50వేలు అందజేశారు. కార్యక్రమంలో రూరల్ సీఐ నగేష్, అదానీ సిమెంట్స్ వైస్‌ఛైర్మన్ రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శరణుబసప్ప, మాజీ ఎంపీటీసీలు రాజ్‌కుమార్, నాయకులు వీరేందర్‌రెడ్డి, శకుంతల, ఆర్సీగౌడ్, వెంకట్‌రాంరెడ్డి, జెర్నె నాగప్ప, నారాయణరెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, ఉదయభాస్కర్‌రెడ్డి, జర్నప్ప, అజ్మత్‌అలీ, సుధాకర్, రాజ్‌కుమార్, విజయ్‌కుమార్, రఘునాథ్‌రెడ్డి, ప్రవీణ్‌గౌడ్, రాంచంద్రారెడ్డి ఉన్నారు. అనంతరం రవీంద్రనాథ్‌రెడ్డి, ఎస్‌బీఐ మేనేజర్‌ను, స్థలదాత రాంరెడ్డిలను ఎస్పీ సన్మానించారు. ప్రజాప్రతినిధులు ఎస్పీని సత్కరించారు.

సైబర్ నేరాల నియంత్రణపై ప్రచారం

తాండూరు:సైబర్ నేరాలను అరికట్టేందుకు ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలను చేపడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి చెప్పారు. సోమవారం తాండూరులోని వినాయక కన్వెన్షన్‌లో ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ), పోలీసు శాఖ ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఎస్పీ పాల్గొన్నారు. ప్రజలు మోసపోతున్న సైబర్ క్రైమ్‌లపై చైతన్య, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. తాండూరు నుంచే ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. 600వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. 1920కు డయల్ చేయడం, ఎలాంటి మోసాలు చేస్తారు తదితర వివరాలతో పోస్టర్లను రూపొందించారు. కార్యక్రమంలో డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, అర్బన్, రూరల్ సీఐలు సంతోష్‌కుమార్, నగేష్, ఐఎంఏ స్థానిక ప్రెసిడెంట్ డాక్టర్ జయప్రసాద్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ అనిల్‌కుమార్‌రెడ్డి, వైద్యులు సంతోష్, శివమోహన్‌రెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్షులు సంతోష్ ఆటోడ్రైవర్లకు టీషర్ట్ పంపిణీ చేశారు.

భగత్‌సింగ్ కలలుగన్న సమాజ నిర్మాణానికి కృషి చేయాలి

ఘట్‌కేసర్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): భగత్‌సింగ్ కలలుగన్న నవసమాజ నిర్మాణం కోసం యువత కృషిచేయాలని ఎస్‌ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అవినాష్, కార్తీక్ అన్నారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్థంతిని పురస్కరించుకొని సోమవారం ఘట్‌కేసర్‌లో ఎస్‌ఎఫ్ఐ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ చేసిన త్యాగం ఎంతో గొప్పదన్నారు. సకల వనరులున్నా నేటికీ దేశ ప్రజలు పేదరికంలో మగ్గడం బాధాకరమన్నారు. విద్యార్థులు చరిత్రను అధ్యయనం చేయాలన్నారు. పరాయి పాలకులను దేశం విడిచిపోవాలని శాసించిన యోధుల త్యాగాలను స్మరించుకోవడం నేటితరం బాధ్యత అని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఫెడరేషన్ మండల అధ్యక్షుడు అనిల్, కార్యదర్శి మనోజ్, సుబ్బు, శ్యామ్, వినయ్, శ్రీరామ్, జితేందర్ పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ విద్యార్థులు

వికారాబాద్‌లో ఎన్‌సీసీ యూనిట్‌ను ఏర్పాటు చేయాలి



కేంద్ర మంత్రి సంజయ్ సేత్‌తో మాట్లాడుతున్న ఎంపీ కె.విశ్వేశ్వర్‌రెడ్డి

వికారాబాద్/పరిగి రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్‌లో ఎన్‌సీసీ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కోరారు. సోమవారం ఢిల్లీలో కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్‌సేత్‌ను కలిసి విన్నవించారు. మారుమూల ప్రాంతాల విద్యార్థులకు ఎన్‌సీసీ యూనిట్ ఉపయోగకరమని మంత్రికి వివరించారు. క్రమశిక్షణ, దేశభక్తి, ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ లభించే అవకాశం ఉందని తెలిపారు. ఇప్పటికే ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లేఖ రాశారని గుర్తు చేశారు. వికారాబాద్‌లోని అనంతపద్మనాభ స్వామి కాలేజీ యాజమాన్యం కూడా ఎన్‌సీసీ యూనిట్ ఏర్పాటుకు సిద్ధంగా ఉందని, ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్‌కు లేఖ పంపారని వెల్లడించారు. ఇందుకు కేంద్ర రక్షణ శాఖ సానుకూలంగా స్పందించడంతో వికారాబాద్ వాసుల ఆశ నిజమవుతుందని ఎంపీ విశ్వాసం వ్యక్తం చేశారు.

జర్నలిస్టులపై సీఎం వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యం



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

కడ్తాల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యమని, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. ప్రభుత్వం ప్రతికా స్వేచ్ఛను హరిస్తోందని సోమవారం కడ్తాల లో లంబాడా హక్కుల పోరాటా సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దశరథ్‌నాయక్, నాయకులు అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు జర్నలిస్టులపై చూపిన ప్రేమ ఏమైందని, అది కపట ప్రేమేనా? అని ప్రశ్నించారు. పస్తులుండి తెలంగాణ ఉద్యమం చేసిన జర్నలిస్టుల వల్లే ఈ రోజు ఆయన ముఖ్యమంత్రి అయ్యారని అన్నారు. వ్యక్తిగత విమర్శలు చేసే వారిపై చట్టపర చర్యలు తీసుకోవాలని గానీ.. 'బట్టలూడదీసి కొడ్తా, రోడ్లపై ఉరికిస్తా.' అని అనడం ముఖ్యమంత్రికి తగదన్నారు. కేసీఆర్‌ను అసభ్యకరంగా మాట్లాడితే సహించేది లేదన్నారు. సీఎం అసెంబ్లీలో క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు రామకృష్ణ, నాయకులు రమేశ్, పాండునాయక్, సిద్ధిగారి వెంకటేశ్, జి.రామచంద్రయ్య, నాగార్జున, అంజి, శ్రీను, కుమార్, వాచ పాల్గొన్నారు.

పట్టా భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలి

రంగారెడ్డి అర్బన్, మార్చి17(ఆంధ్రజ్యోతి): రైతుల పట్టా భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య డిమాండ్ చేశారు. సోమవారం రంగారెడ్డి అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఫార్మాసిటీలో అసైన్డ్, పట్టాభూములతో పాటు గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుకు భూములు కోల్పోయిన రైతులకు వెంటనే పరిహారమివ్వాలని కోరారు. నిర్వాసితులకు 121చదరపు గజాల ఇంటి స్థలం ఇచ్చారని, దానికి 500చదరపు గజాలకు పెంచి ఇంటి స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.15లక్షలివ్వాలని కోరారు. గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు ఓఆర్ఆర్ ఎగ్జిట్ 13నుంచి మీర్‌ఖాన్‌పేట మీదుగా ఆకుతోటపల్లి ఆర్ఆర్ఆర్ వరకు నిర్మించ తలపెట్టిన 300ఫీట్ల రోడ్డు విస్తరణఓ భూములు కోల్పోతున్న వారికి ఎకరానికి వెయ్యి గజాల చొప్పున ఇంటి స్థలం ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో నాయకులు కాడిగల్ల బాస్కర్, సామేలు, చంద్రమోహన్, రాంచందర్, జగదీష్, నర్సింహ, జగన్, కవిత ఎ.నర్సింహ, జంగయ్య, బి.రాములు, రాజు, శోభన్, జంగయ్య, పి.అంజయ్య, శ్యాంసుందర్, శ్రీనివాస్‌రెడ్డి, రుద్రకుమార్, కిషన్, నర్సింహ, నర్సిరెడ్డి, కె.సుమలత ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ జరిగే వరకు ఉద్యమం



చేవెళ్లలో నిరసన దీక్ష చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

చేవెళ్ల, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తేనే మాదగల బతుకులు మారుతాయని ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి బాత్యాల శివశంకర్, చేవెళ్ల మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ అన్నారు. సోమవారం చేవెళ్లలో నిరాహార దీక్షలు నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పోరాటాల ఫలితంగా ఎస్సీ వర్గీకరణ సాకారం అవుతుందన్నారు. ఎస్సీ వర్గీకరణ మాదిగల 70సంవత్సరాల ఆకాంక్ష అన్నారు. ఎస్సీ వర్గీకరణ బిల్లును అసెంబ్లీ వెంటనే ఆమోదించి అమలు చేయాలన్నారు. వర్గీకరణ చట్టం చేసే వరకు ఉద్యమం ఆగదన్నారు. కార్యక్రమంలో ఎంఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు భానుప్రసాద్, నాయకులు రాములు, మల్లేష్,వెంకటేశ్, రాజు, కుమార్, సత్యనందం, గుండు ఆశోక్, వినోద్‌కుమార్, విజయ్‌కుమార్, ప్రసాద్, శాంతికుమార్, లింగం తదితరులు పాల్గొన్నారు.

తలకొండపల్లి: ఎస్సీ వర్గీకరణ చట్టం చేశాకే ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలు చేపట్టాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి పోతుగంటి కృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. మాదిగలకు అన్యాయం జరిగితే ఎంతటి పోరాటానికైనా వెనుకాడం అని స్పష్టం చేశారు. తలకొండపల్లిలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్‌ల ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారంతో ఏడో రోజుకు చేరాయి. దీక్షలను బీఆర్ఎస్ నాయకులు శేఖర్‌యాదవ్, గౌడ సంఘం కల్వకుర్తి నియోజకవర్గ కన్వీనర్ మోకురాల అశోక్ గౌడ్ సందర్శించి సంఘీబావం తెలిపారు. దీక్షలో నాయకులు గోపాల్, శరత్‌చంద్ర, మార్కండేయ, రజనీకాంత్, సురేశ్, దయాకర్, రాజు, జలేందర్, మహేశ్, శ్రీశైలం, జగన్, గిరిప్రసాద్ కూర్చున్నారు. వర్గీకరణ చట్టం చేసి గ్రూప్స్, హెచ్‌డబ్ల్యూవో పోస్టుల నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేదంటే మాదిగలు, ఉప కులాల అభ్యర్థులకు అన్యాయం జరుగుతుందన్నారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే వర్గీరణ చట్టం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ నాయకులు శ్రీకాంత్, కుమార్, యాదయ్య, రాజు, వీరేశ్, సురేశ్, మల్లయ్య, శశికాంత్, కిరణ్, వంశీ, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్ అర్బన్: ఎస్సీ వర్గీకరణ తర్వాతే రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ నియామకాలను చేపట్టాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. షాద్‌నగర్‌లో చేపట్టిన రిలే నిరాహార దీక్ష ఎనిమిదో రోజుకు చేరుకుంది. సోమవారం నాయకులు అర్ధనగ్న ప్రదర్శన చేసి నిరసన తెలిపారు. దీక్షకు హాజరైన ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింహ మాదిగ మాట్లాడుతూ.. మంద కృష్ణ ముప్పై ఏళ్ల పాటు సుదీర్ఘ పోరాటం చేసి, ఎస్సీ వర్గీకరణ అమలుకు మార్గాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణను అమలు చేస్తేనే మాదిగలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. నిరసన కార్యక్రమంలో నాయకులు బాల్‌రాజ్ మాదిగ, సుదర్శన్ మాదిగ, సురేష్, శ్రీనివాస్ మాదిగ, శేఖర్ మాదిగ, రాజు, నవీన్, రాకేష్, సతీష్, నాగేష్, సీతారాం తదితరులు పాల్గొన్నారు.



తలకొండపల్లి : నిరాహార దీక్షలో ఎమ్మార్పీఎస్ నాయకులు



షాద్‌నగర్‌లో అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న నాయకులు

బోర్ మోటార్ చెడిపోయి తాగునీటికి ఇబ్బందులు



ధారూరు స్టేషన్ కాలనీలో ఖాళీ బిందెలు, బకెట్లతో మహిళల నిరసన

ధారూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ధారూరు స్టేషన్ గ్రామం ఓ కాలనీలో బోర్ మోటార్ చెడిపోయి తాగునీటికి ఇబ్బందులు తలెత్తాయి. బోర్ మోటార్ మరమ్మతులకు అధికారులు చర్యలు తీసుకోకపోవటంతో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని కాలనీ వాసులు తెలిపారు. సోమవారం మహిళలు ఖాళీ బిందెలు, బకెట్లు రోడ్డుపై పెట్టి నిరసన వ్యక్తం చేశారు. గ్రామంలోని శ్మశాన వాటిక పక్కనున్న కాలనీ బోర్‌మోటార్ చెడిపోయి మూడు రోజులవుతోందని యువకులు తెలిపారు. నీటి కోసం పక్క కాలనీల బోర్ల వద్దకు వెళ్తున్నామని ప్రజలు చెప్పారు. మోటార్‌ను బాగు చేయించాలని నాయకులను కోరినా పట్టించుకోవటంలేదని, పంచాయతీ కార్యదర్శి అందుబాటు లేరని, పంచాయతీకి తాళం ఉందన్నారు. మండల పరిషత్ అధికారులకు తెలిపినా స్పందన లేదని వాపోయారు. మోటార్‌కు మరమ్మతు చేయించి నీటి సమస్య తీర్చాలని కోరారు.

ఎండిన వరి పంట



యాచారం మండలం చిన్నతూండ్లలో ఎండిపోయిన వరి చేనులో మేస్తున్న పశువులు

- లబోదిబోమంటున్న రైతులు
- అప్పులు మిగిలాయని ఆందోళన

యాచారం/ఆమనగల్లు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలో యాసంగిలో సాగుచేసిన వరి పంట ఎండుతోంది. మూడేళ్లుగా వర్షాలు బాగా కురియక భూగర్భజలం గణనీయంగా పడిపోవడంతో బోర్లు పోయక వరి పంటలు ఎండుతున్నాయి. దిక్కుతోచక రైతులు లబోదిబోమంటున్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో 185ఎకరాలకుపైగా వరి పంటలు ఎండిపోయినట్లు రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఎండలు ముదురుతుండడం, నీటిమట్టం పడిపోతుండడంతో రానున్న 20రోజుల్లో మండలంలో ఐదారు వందల ఎకరాల్లో వరి పంట ఎండిపోవచ్చని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరం వరి సాగుకు రూ.45వేల పెట్టుబడి పెట్టామని, అప్పు చేసి వరి వేస్తే పంటంతా ఎండి అప్పులే మిగిలాయని చిన్నతూండ్ల, నల్లవెల్లి తదితర గ్రామాల రైతులు రాజయ్య, కిష్టయ్య, దర్శన్ ఆవేదనచెందారు. కళ్లముందే పంట ఎండిపోతుండడంతో గుండె చెరువవుతోందని రైతులంటున్నారు. ధర్మన్నగూడలో 10ఎకరాలు, కొత్తపల్లిలో 22 ఎకరాలు, చిన్నతూండ్లలో 15 ఎకరాలు, కుర్మిద్ద, తాటిపర్తి, మేడిపల్లి, నానక్‌నగర్ గ్రామాల్లో 60 ఎకరాలు, మంతన్‌గౌరెల్లి, శ్రీమంతగూడ, మాల్, నల్లవెల్లి తదితర గ్రామాల్లో 82ఎకరాల్లో వరి పంట ఎండుతోంది. అలాగే ఆమనగల్లు మండలంలో యాసంగి సీజన్‌లో 4,600 ఎకరాల్లో వరి పంట సాగుచేశారు. భూగర్భ జలాలు అడుగంటుతుండడంతో పంటలను కాపాడుకునేందుకు అన్నదాతలు తిప్పలు పడుతున్నారు. దీనికి తోడు కరెంటు కోతలు తోడవడంతో అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఎండిన వరి చేలలో పశువులను మేపుతున్నారు.

ఇప్పటికే మూడెకరాల వరి ఎండిపోయింది



పది ఎకరాల్లో వరి పంట సాగు చేశాను. అందులో ఇప్పటికే మూడు ఎకరాల వరి పంట ఎండిపోయింది. బోర్లలో నీరు తగ్గి మిగిలిన 7ఎకరాల వరి పంటైనా చేతికందుతుందనే నమ్మకం లేదు. ఎకరం పొలం సాగుకు రూ.45వేల పెట్టుబడైంది. పంటంతా ఎండితే రూ.4.5లక్షల అప్పులు మిగులుతాయి. ప్రభుత్వం ప్రకృతి విపత్తు కింద ఆర్థిక సాయం అందించాలి.

- ప్రదీప్‌రెడ్డి, రైతు, ధర్మన్నగూడ, యాచారం మండలం

రోజుకు 5గంటల విద్యుత్ కోత

మండలంలో రోజూ 5గంటల పాటు విద్యుత్ కోత విధిస్తున్నారు. రోజూ సాయంత్రం 6 నుంచి రాత్రి 11గంటల వరకు సింగిల్ ఫేజ్ కరెంటు, అక్కడి నుంచి త్రీఫేజ్ సరఫరా ఇస్తున్నారు. రైతులు రాత్రి వేళ పొలాలకు వెళ్లలేక ఉదయం నాలుగున్నర గంటలకు పొలం వెళ్లి పంటలకు నీరు పెడుతున్నామని కొత్తపల్లికి చెందిన రైతు జంగయ్య చెప్పారు. త్రీ ఫేజ్ సరఫరాలో కూడా తరచూ అంతరాయం కలుగుతోందని రైతులు చెబుతున్నారు.



యాచారం మండలం కొత్తపల్లిలో ఎండిపోయిన వరి చేను



ఆమనగల్లు మండలంలో నీరందని వరి చేను

అడవిని తగలబెడితే కఠిన చర్యలు



తగలబడుతున్న అడవి

ధారూరు, మార్చి17(ఆంధ్రజ్యోతి): ధారూరు అటవీ రేంజ్‌లో రాత్రి పూట కొందరు అడవిని తగలబెడుతున్నారని, అటవీప్రాంతాన్ని ఆక్రమించేందుకే ఇలా చేస్తున్నారని రేంజర్ రాజేందర్ సోమవారం తెలిపారు. ఇలాంటి చర్యలకు పాల్పడినా, అసైన్డ్ పేరిట అడవిని నరికినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అడవిలో చెట్లు నరికి, చదును చేసేందుకు వచ్చే ట్రాక్టర్లు, డోజర్లు, జేసీబీలను సీజ్‌చేసి కోర్టుకు అప్పగిస్తామని చెప్పారు. విలేకరులతో మాట్లాడుతూ.. రేంజ్‌లోని దోర్నాల, సంగాయిపల్లి తండా, రాస్నం, జుంటుపల్లి, గంగాసాగర్, అడాల్‌పూర్, తిమ్మాయిపల్లి, బాణాపూర్, బిజ్వారం, కమాల్‌పూర్, పగిడ్యాల పరిధిలో కొందరు రాత్రి పూట ఆడవికి నిప్పు పెట్టిఆ రాత్రికిరాత్రి చదును చేసి ఆక్రమిస్తున్నారని చెప్పారు. అడవిని ఆక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. అడవులను రక్షించేందుకు ప్రజలు, యువత సహకరించాలని చేశారు.

బీజేపీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి

వికారాబాద్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): భారతీయ జనతా పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ కె.రాజశేఖర్‌రెడ్డిని నియమించారు. సోమవారం పార్టీ రాష్ట్ర ఎన్నికల అధికారి ఎండల లక్ష్మీనారాయణ, కో-రిటర్నింగ్ అధికారి గీతామూర్తి ప్రకటించారు. మూడు అసెంబ్లీ నియోజకవర్గాలకు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులను ఎంపిక చేశారు. పరిగికి కాతన్‌పల్లి అంజిలయ్య, వికారాబాద్‌కు రాచ శ్రీనివాస్‌రెడ్డి, తాండూరుకు బాలి శివకుమార్‌ను నియమించారు. జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి ఎన్నేపల్లిలోని మా శారద ఆసుపత్రి డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు.

కమలంలో కల్లోలం?!

రాజశేఖర్‌రెడ్డి పార్టీలో చేరిన ఏడాదిలోనే పార్టీ జిల్లా అధ్యక్ష పదవి ఇవ్వడం పట్ల సీనియర్ నాయకులు మండిపడుతున్నారు. అధ్యక్ష పదవికి కె.శివరాజ్, టి.సదానందరెడ్డి, యు.రమేష్‌కుమార్, కేపీ.రాజు, ఇటీవల పార్టీలో చేరిన వడ్ల నందు, కొప్పు రాజశేఖర్‌రెడ్డి పోటీ పడ్డారు. ప్రధాన పోటీ శివరాజ్, రమేష్‌కుమార్ మధ్య ఉందనుకున్నారు. వీరిని కాదని రాజశేఖర్‌రెడ్డికి జిల్లా పార్టీ అధ్యక్ష పదవిని ఎలా ఇస్తారంటూ సీనియర్లు భగ్గుమంటున్నారు. రాజశేఖర్‌రెడ్డి జిల్లాకు స్థానికుడు వాసి కాదని, అధ్యక్ష పదవికి ఆయన దాఖలు చేసిన నామినేషన్నే తిరస్కరించాలని సీనియర్లు ఎన్నికల అధికారికి సోమవారం ఫిర్యాదు చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ కోసం పనిచేయని వ్యక్తికి జిల్లా అధ్యక్ష పదవి ఎలా ఇస్తారంటూ ప్రశ్నిస్తున్నారు. ఇంత వ్యతిరేకత మధ్య పార్టీని ఎలా ముందుకు తీసుకు వెళతారంటూ ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంలో తాము వెనక్కి తగ్గేది లేదని, రాష్ట్ర నాయకులతో అమీతుమీ తేల్చుకుంటామంటూ వారు అల్టిమేటం ఇచ్చారు.

రంగారెడ్డి రూరల్ జిల్లా అధ్యక్షుడిగా పతంగి రాజ్‌భూపాల్‌గౌడ్

రంగారెడ్డి అర్బన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): బీజేపీ సంస్థాగత ఎన్నికల్లో భాగంగా ఇప్పటికే రాష్ట్రంలో కొన్ని జిల్లాకు అధ్యక్షులను ప్రకటించింది. సోమవారం రంగారెడ్డి జిల్లా రూరల్ అధ్యక్షుడిగా పతంగి రాజ్‌భూపాల్‌గౌడ్‌ను నియమించారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర ఎన్నికల అధికారి ఎండల లక్ష్మీనారాయణ ప్రకటించినట్లు జిల్లా ఇన్‌చార్జి ఎన్నికల అధికారి కట్ట సుధాకర్‌రెడ్డి తెలిపారు. శంషాబాద్ మండలం పాలమాకులకు చెందిన రాజ్‌భూపాల్‌గౌడ్ 1995 నుంచి బీజేపీ, యువమోర్చాల్లో వివిధ స్థాయిల్లో పదవులు నిర్వహించారు. ఐదు సార్లు సర్పంచ్‌గా పనిచేశారు. అలాగే ఆయన కుటుంబీకులు ప్రజా ప్రతినిధులుగా సేవలందించారు.

కరన్‌కోట్‌లో కొత్త రేషన్ కార్డుల జారీ

తాండూరు రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కరన్‌కోట్‌లో 190 మందికి సోమవారం కొత్త రేషన్ కార్డులను జారీ చేసి సరుకులను అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే రేషన్ కార్డులివ్వడంతో సరుకులు అందాయని మాజీ ఎంపీటీసీ రాజ్‌కుమార్ పేర్కొన్నారు.

పారిశుధ్య పనులు చేయాలి

కులకచర్ల, మార్చి17(ఆంధ్రజ్యోతి):గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని ఎంపీవో భాస్కర్‌గౌడ్ తెలిపారు. ముజాహిద్‌పూర్‌లో సోమవారం పర్యటించి పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించారు

సైన్స్ ఫెయిర్‌తో మేథస్సు పెంపు

తాండూరు, మార్చి 17(ఆంధ్రజ్యో తి): సైన్స్ ఫెయిర్లలతో విద్యార్థుల మేథస్సు పెరుగుతుందని శ్రీ చైతన్య కళాశాల ప్రిన్సిపాల్ షేక్ మాదన్ అన్నారు. సైన్స్ ఫెయిర్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు సోమవారం ఆయన సర్టిఫికెట్లను అందజేసి అభినందించారు.

క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



పూడూరు: విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న టీచర్లు

వికారాబాద్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): నవాబుపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం శిక్షణ ఫౌండేషన్, విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఎంఈవో అబ్దుల్ రహెమాన్ మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లోని నైపుణ్యాలను వెలికితీసేందుకు దోహదపడతాయని తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఎంఈవో, హెచ్‌ఎం మల్లేశం ప్రశాంసపత్రాలు అందించి అభినందించారు. ఫౌండేషన్ ప్రతినిధులు రాజు, లక్ష్మి, నారాయణ, యాదయ్య పాల్గొన్నారు.

పూడూరు: ది హాన్స్ ఫౌండేషన్ దాతల సహకారంతో శిక్షణ ఫౌండేషన్, విద్యాశాఖ వికారాబాద్ ఆధ్వర్యంలో మేడిపల్లికలాన్ పాఠశాలలో సోమవారం కాంప్లెక్స్ స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో 9 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో భాగంగా మేడిపల్లి, అంగడి చిట్టంపల్లి పాఠశాల విద్యార్థులు పోటీపడగా అంగడిచిట్టంపల్లి స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపారు. విద్యార్థులకు ప్రేరణ పురస్కార్ సర్టిఫికెట్లు అందజేశారు. హెచ్‌ఎం శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఇంటి వద్దకే భద్రాద్రి రామయ్య ముత్యాల తలంబ్రాలు

పరిగి రూరల్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఇంటి వద్దకే భద్రాద్రి రామయ్య ముత్యాల తలంబ్రాలు పంపిణీ చేసేందుకు టీజీఎస్ఆర్టీసీ సిద్ధమైందని రంగారెడ్డి రీజియన్ లాజిస్టిక్ ఏటీఎం రవీందర్ సోమవారం తెలిపారు. భద్రాచలంలో ఏప్రిల్ 6న సీతారాముల కల్యాణం జరగనుండగా, ఉత్సవాలకు వెళ్లలేని భక్తులు తలంబ్రాలను ఆర్టీసీ కార్గో ద్వారా పొందొచ్చన్నారు. రూ.151చెల్లించి బుకింగ్ చేసుకోవచ్చని, ఈ నెల 12 నుంచి ఏప్రిల్-7 వరకు బుకింగ్ ఉంటుందని తెలిపారు. తలంబ్రాల కోసం ప్రజలు.. వికారాబాద్ ప్రాతం- 9154298740/ 9177636149, పరిగి-9154298738/ 9162513332, తాండూరు 9154298739/ 9830983l549, రంగారెడ్డి ఆర్‌ఎమ్‌ఈ వారు 9154298733 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

డ్వాక్రా మహిళల డబ్బు స్వాహా

ఘట్‌కేసర్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): నెలనెలా అప్పు కింద బ్యాంక్‌లో జమచేయాల్సిన డబ్బును స్వాహాచేసిన సూపర్‌వైజర్(వివోఏ)పై చర్యలు తీసుకోవాలని డ్వాక్రా మహిళలు డిమాండ్ చేస్తున్నారు. పోచారం పరిధి చౌదరిగూడలో రెండేళ్ల క్రితం డ్వాక్రా మహిళలు శ్రీనిధి రుణాలు తీసుకున్నారు. వీరు క్రమం తప్పకుండా బాకీ కింద వీవోఏకు, గ్రూప్ లీడర్‌కు చెల్లించే వారు. అయితే వారిద్దరూ డబ్బులు బ్యాంకులో సక్రమంగా చెల్లించలేదు. రెండేళ్ల క్రితం నిర్వహించిన అడిట్‌లో రూ.7లక్షలు తేడా వచ్చింది. విచారణ చేసిన అధికారులు వీవోఏ సువర్ణ, అప్పటి లీడర్ డబ్బు స్వాహా చేశారని తేల్చారు. అధికారుల ఒత్తిడితో అధ్యక్షురాలు రూ.3.5లక్షలు చెల్లించింది. వీవోఏ సువర్ణ మాత్రం సొంతానికి వాడుకున్న డబ్బు చెల్లించలేదు. అధికారులు గ్రూపుల సభ్యులకు అప్పు చెల్లించాలని నోటీసులు జారీచేశారు. తాము సువర్ణకు రెగ్యులర్‌గా కట్టామనుకున్న మహిళలు.. నోటీసులతో ఆందోళనకు గురై ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.ఈ విషయమై ఏపీఎం తౌర్యానాయక్ స్పందిస్తూ.. రెండేళ్లుగా సంస్థకు డబ్బు చెల్లించలేదని, గతంలోనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు.

20న తైబజార్ వేలం

కొడంగల్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఈ నెల 20న కొడంగల్ మున్సిపల్ తైబజార్ వేలం నిర్వహిస్తామని కమిషనర్ బలరాంనాయక్ సోమవారం పేర్కొన్నారు. వేలంలో పాల్గొనే వారు రూ.50వేల డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు మంగళవారం గడువు అని తెలిపారు.

యువతను మోసగించిన కాంగ్రెస్ ప్రభుత్వం


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

షాద్‌నగర్ అర్బన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ అమలు చేయకుండా యువతను మోసగించిందని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం శాసన మండలిలో మాట్లాడుతూ కల్యాణ లక్ష్మీ కింద తులం బంగారం ఇస్తామని మాట మారుస్తున్నారని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా 317 జీఓను అమలు చేస్తూ ఉద్యోగులను ఇబ్బంది పెడుతున్నారన్నారు.

కల్వకుర్తి ఆర్టీసీ డిపోకు 16 కొత్త బస్సులు

ఆమనగల్లు, మార్చి17(ఆంధ్రజ్యోతి): కల్వకుర్తి ఆర్టీసీ డిపోకు ప్రభుత్వం 16 కొత్త బస్సులు కేటాయించిందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి తెలిపారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నుంచి సోమవారం ఈమేరకు ఉత్తర్వులు జారీ అయినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన వెయ్యి బస్సుల్లో కల్వకుర్తి డిపోకు 16 కేటాయించినట్లు వెల్లడించారు. ఈనెలలో 14, మేలో ఒకటి, జూన్‌లో ఒకటి కేటాయిస్తారని వివరించారు.

డ్రైనేజీ పూడ్చివేతపై ఫిర్యాదు

శంకర్‌పల్లి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): డ్రైనేజీ పూడ్చిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తీసుకోవాలని సోమవారం మోకిల పంచాయతీ కార్యదర్శి ఎల్లయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన వినోద్‌కుమార్ తన రెండెకరాల పొలంలోకి మురుగు నీరు వస్తుందని గ్రామ పంచాయతీలో ఫిర్యాదు చేశాడు. విచారణ చేస్తామని అధికారులు చెప్పినా వినకుండా ప్రధాన రహదారి పక్కన మురుగునీరు వెళ్లే కల్వర్టులో మొరం నింపాడు. దీంతో వినోద్‌కుమార్‌పై పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు చేశాడు.

స్పోర్ట్స్ డ్రెస్‌లు అందజేత

కొత్తూర్, మార్చి 17: (ఆంధ్రజ్యోతి): పెంజర్ల ఉన్నత పాఠశాలలో 120 మంది విద్యార్థులకు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎమ్మె సత్యనారాయణ స్పోర్ట్స్ డ్రెస్సులను అందజేశారు. విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించేందుకు స్పోర్ట్స్ డ్రెస్‌లు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ప్రసన్న, కొత్తూర్ మాజీ జడ్పీటీసీ మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మెండె కృష్ణ, మాజీ సర్పంచ్‌లు వన్నం బాల్‌రాజ్, సత్తయ్య ఉన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

యాచారం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): వేసవిలో రాత్రి వేళ దాబాలపై నిద్రించొద్దని, దొంగలు అదును చూసి చోరీలకు పాల్పడే అవకాశం ఉందని హైదరాబాద్ గ్రీన్ ఫార్మా సిటీ సీఐ లిక్కి కృష్ణంరాజు, ఎస్సై తేజంరెడ్డి అన్నారు. సోమవారం మాలగూడలో పర్యటించి ప్రజలకు పలు సూచనలు చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తే 100కు కాల్ చేసి తెలపాలన్నారు. పదో తరగతి పరీక్షలు పూర్తయ్యే వరకు పిల్లలకు పనులు చెప్పొద్దని సూచించారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

షాబాద్, మార్చి16 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌తోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని టీపీసీసీ కార్యదర్శి రాంరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సూర్యగౌడ్ అన్నారు. సోమవారం మాచన్‌పల్లిలో రూ.5 లక్షలతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. గ్రామస్తులు చేగూరి యాదయ్య, నరేందర్‌గౌడ్, రాజేందర్, రాజశేఖర్‌గౌడ్, మహేందర్, నరేష్, నవీన్, రమేష్, మాణిక్‌రెడ్డి, జైపాల్ యాదవ్, ముసిలయ్య తదితరులున్నారు.

ఇళ్ల పొజిషన్ చూపాలి

ఇబ్రహీంపట్నం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మంచాల మండలం లింగంపల్లి గేట్ వద్ద లబ్ధిదారులకు కేటాయించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లకు సంబంధించి పొజిషన్ చూపాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రావుల జంగయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఇబ్రహీంపట్నంలో నిర్వహించిన ప్రజావాణిలో లబ్ధిదారులతో కలిసి ఎంపీడీవో వెంకటమ్మకు వినతిపత్రం అందజేశారు.

నీడ లేదు.. నీళ్లు లేవు!

(5వ పేజీ తరువాయి)

మూడేళ్లుగా వేసవి అలవెన్స్ రావడం లేదు. ఈజీఎస్ పని ప్రదేశాల్లో కూలీలకు తాగునీరు, నీడ వసతి లేక ఇంటి నుంచి మంచినీళ్లు తెచ్చుకుంటున్నారు. కూలీలకు పే స్లిప్పులు ఇవ్వక పోవడం వల్ల చేసిన పనికి కూలీల వద్ద ఆధారం లేకుండా పోతుంది. డబ్బులు కూడా కొన్ని సార్లు సకాలంలో అందటం లేవు.

చేవెళ్ల మండలంలో 3,362 జాబ్ కార్డులు ఉండగా ఇందులో 340 మంది కూలీలు ఉపాధి పనులు చేస్తున్నారు. అలాగే శంకర్‌పల్లి మండలంలో 4,465 జాబ్‌కార్డులు ఉండగా, ఇందులో 500మంది మాత్రమే ఉపాధి పనులకు వెళ్తున్నారు. మరో 350 మందికి వంద రోజుల పని పూర్తయ్యింది. షాబాద్ మండలంలో 8,000 జాబ్ కార్డులు ఉండగా, ఇందులో 761 మంది ఉపాధి పనులకు వెళ్తున్నారు. కాలువల్లో పూడిక తీయడం, మెరక పంటపొలాల్లో, వరి పొలాల్లో భూమిని చదును చేయడం, పంట చేల గట్లపై మొక్కల పెంపకం, చెక్‌డ్యాంలో పూడిక తీయడం తదితర పనులు నిర్వహిస్తున్నారు. ఎండలు మండుతుండటంతో ఉదయం 6 నుంచి 10 గంటల మధ్య కూలీలు పనులు చేస్తున్నారు. మిగిలిన పనులు ఉంటే సాయంత్రం 5 నుంచి 6గంటల మధ్య పూర్తిచేస్తున్నారు. కూలీలకు ఒక్కొక్కరికి రోజుకు రూ. 250 నుంచి 270 వరకు అందజేస్తున్నారు. పారలు, గంపలు తదితర సామగ్రికి కూలీలకు రోజుకు రూ. 5 చొప్పున ప్రభుత్వం అందజేస్తుంది. పనిచేసే చోట ఎండల నుంచి ఉపశమనం పొందడానికి కూలీల ఎలాంటి టెంట్లు వేయడం లేదు. అలాగే ఫస్టఎయిడ్ కిట్లు సైతం కన్పించడం లేదు. ప్రస్తుతం కూలీలకు రెండు వారాల తర్వాత డబ్బులు వారి ఖాతాలో జమ అవుతున్నాయి. ఫీల్డ్ అసిస్టెంట్లకు మాత్రం మూడు నెలల జీతాలు రావాల్సి ఉంది.

షాద్‌నగర్ నియోజకవర్గంలో ఉన్న 33,513 జాబ్‌కార్డుల్లో 13,683 జాబ్ కార్డులు పనిచేస్తున్నాయి. సోమవారం రోజున 3940 మంది కూలీలు పనికి హాజరయ్యారు. ఉదయం 7 గంటల నుంచి 7.30 గంటలకు


ఆమనగల్లు: పనుల్లో నిమగ్నమైన కూలీలు

పనులకు వెళుతున్నారు. కూలీలు ఎండలో పనిచేస్తున్నారు. ఎక్కడ కూడ టెంట్లు వేసిన దాఖలాలు లేవు. తాగేందుకు నీటి సౌకర్యం కల్పించ లేదు. ఇంటి నుంచి నీటిని తెచ్చుకుని తాగుతున్నారు. పది మంది కూలీలకు కలిసిపి ఒక పార, గడ్డపార అందిస్తున్నారు. వేసవి అలవెన్స్ రావడం లేదు.

నాలుగేళ్లుగా ఏపీవో పోస్టుఖాళీ

చేవెళ్ల మండలంలో గత నాలుగు సంవత్సరాలుగా ఏపీవో పోస్టు ఖాళీగా ఉంది. టెక్నికల్ ఏఈ రాజశేఖర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు. పూర్తి స్థాయిలో ఏపీవో లేకపోవడంతో ఉపాధి పనులు మొక్కుబడిగా సాగుతున్నాయి. క్షేత్రస్థాయిలో ఈజీఎస్ పనుల పర్యవేక్షణ కొరవడింది. ఏళ్ల తరబడి ఖాళీగా ఉన్న ఏపీవో పోస్టును భర్తీ చేయాలని కూలీలు డిమాండ్ చేస్తున్నారు.

మూడు వారాల బిల్లులు పెండింగ్

అటవీ భూముల్లో, రైతుల పొలాల్లో నీటి నిల్వ సామర్థ్యం కోసం ఫాం పండ్స్ నిర్మాణం, ఊట చెరువుల కట్టల బలోపేతం పనులు, పొలాల్లో భూసార సంరక్షణ పనులు కొనసాగుతున్నాయి. పలు చోట్ల పశువుల షెడ్ల నిర్మాణం చేస్తున్నారు. మూడు వారాల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని కూలీలు చెప్తున్నారు. కాగా ఇబ్రహీంపట్నం మండలంలో మొత్తం జాబ్ కార్డులు 5,820 ఉన్నాయి. 913 మంది కూలీలు పనిచేస్తున్నారు. యాచారం మండలంలో మొత్తం 13,081 జాబ్ కార్డులకుగాను 1393 మంది కూలీలు పనులు చేస్తున్నారు. మంచాల మండలంలో 11,500 జాబ్ కార్డులుండగా 1175 మంది కూలీలు మాత్రమే పనులు చేస్తున్నారు. కందుకూరు మండలంలో 9,948 జాబ్ కార్డులుండగా 1475 మంది కూలీలు పనిచేస్తున్నారు. మహేశ్వరంలో మండలంలో అతి తక్కువగా కేవలం 82 మంది కూలీలు మాత్రమే ఉపాధి పనులకు హాజరవుతున్నారు.

కూలి గిట్టుబాటు కావడం లేదు



వేసవి అలవెన్స్‌లను ఎత్తేయడంతో కూలీ గిట్టుబాటు కావడం లేదు. రోజుకు కనీసం రూ.300కూడా రావడం లేదంటే ఎట్లా బతకాలి. పారలు, గడ్డపారలు, గంపలు కూడా మేమే తెచ్చుకుంటున్నం. గడ్డపార మొన బెట్టాలంటే రూ.150, గొడ్డలి సర్వియ్యాలంటే రూ.100 తీసుకుంటుండ్రు. అంతేగాక ఆటో కిరాయి కూడా మేమే భరిస్తున్నాం.

\- అంకర్ల శ్రీలత, రాయపోల్, ఇబ్రహీంపట్నం

ఎలాంటి బకాయిల్లేవు



ఈజీఎస్ పనులకు సంబంధించి బకాయిలు ఏమి లేవు. వారం వారం డబ్బులు చెల్లిస్తున్నాం. అడ్మినిస్ట్రేటివ్ కాస్ట్ లేకపోవడం వల్ల పే స్లిప్పులు ప్రింటు చేసి ఇవ్వలేకపోతున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా ఈ సమస్య ఉంది. ఉన్నతాధికారులకు నివేదించాం. గ్రామ పంచాయతీల ద్వారా పని ప్రదేశాల్లో తాగునీరు, నీడ వసతికి చర్యలు తీసుకుంటున్నాం.

\- మాధురి, ఎంపీడీవో, ఆమనగల్లు

కదంతొక్కిన ఆశా కార్యకర్తలు


ఆమనగల్లు: తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆశా కార్యకర్తలు

ఆమనగల్లు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఆశా కార్యకర్తలు సోమవారం నిరసన చేపట్టారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా చేపట్టారు. ఆశా కార్యకర్తలకు రూ.18 వేలు వేతనం అందించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ లలితకు అందజేశారు. ఆశా కార్యకర్తల సమస్యల పరిష్కారానికి ఈనెల 19న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తల మండల అధ్యక్షురాలు అనిత, ప్రధాన కార్యదర్శి చంద్రకళ, కోశాధికారి బీబీ, నాయకురాళ్లు వసంత, మంజుల, నయూమ, అనిత, జంగమ్మ, సంతోష, లక్ష్మి పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

కందుకూరు: హామీల అమలులో కాంగ్రెస్ విఫలమైందని సీఐటీయూ మండల కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్ ఆరోపించారు. ఆశా వర్కర్లు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన ధర్నాలో పాల్గొని మాట్లాడారు. ఎన్నికల సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆశా వర్కర్లను పర్మినెంట్ చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో సరస్వతి, చంద్రకళ, ముంతాజ్‌బేగం, అప్రోచ్, అనిత, రేణుక, శారద, మాదవి పాల్గొన్నారు.

రూ.18 వేల వేతనం ఇవ్వాలి

ఇబ్రహీంపట్నం: బడ్జెట్ సమావేశాల్లో ఆశాలకు రూ.18 వేల వేతనం ఫిక్స్ చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ బుగ్గరాములు డిమాండ్ చేశారు. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో తహసీల్దార్ సునీతారెడ్డికి వినతి పత్రం అందజేశారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

శంషాబాద్ రూరల్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు రెండో రోజు సోమవారం సైతం కొనసాగాయి. ఎమ్మార్పీఎస్ నాయకుడు మైలారం భిక్షపతి మాట్లాడుతూ అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించేంత వరకు దీక్షలు కొనసాగుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు మద్దిలేటి మాదిగ, రాష్ట్ర ప్రచార కార్యదర్శులు రాచమల్ల రమేశ్, రత్నం, కార్యదర్శి కొత్తూర్ రమేశ్, ఎమ్మార్పీఎస్ శంషాబాద్ మున్సిపల్ అధ్యక్షుడు రాచమల్ల రాజు, ఎంఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు మైలారం సుమన్, కిరణ్, పోతుగంటి రాజరత్నం పాల్గొన్నారు.

మహేశ్వరంలో..

మహేశ్వరం: ఎస్సీ వర్గీకరణ చేశాకే ఉద్యోగ నియామకాలు చేపట్టాలని ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి బక్కని రవి అన్నారు. మహేశ్వరంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష సోమవారంతో ఆరో రోజుకు చేరింది. నాయకులు ప్రశాంత్, గణేష్, కృష్ణ, అర్జున్ శేఖర్, దశరథ, శంకరయ్య, భరత్‌కుమార్ పాల్గొన్నారు.

ఏ హోదాతో శంకుస్థాపన చేస్తున్నారు?

షాద్‌నగర్ అర్బన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): బీజేపీ నాయకులు ఏ హోదాతో రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తున్నారో చెప్పాలని షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్ ప్రశ్నించారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులో సోమవారం మాట్లాడారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని కిషన్‌నగర్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ సబ్ ప్లాన్ నిధులను మంజూరు చేయిస్తే బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందె బాబయ్య, నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి రోడ్డు పనులకు శంకుస్థాపనలు చేయడం సిగ్గుచేటన్నారు. విఠ్యాలలో పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, మొగిలిగిద్దలో అందె బాబయ్య, కక్కునూరి వెంకటేష్‌గుప్త రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారని చెప్పారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు బాల్‌రాజ్‌గౌడ్, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనునాయక్, ప్రదీప్‌కుమార్, జంగయ్య పాల్గొన్నారు.


ఇఫ్తార్ విందులో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

షాబాద్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు అని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం షాబాద్‌లో పహిల్వాన్‌షావలి దర్గాలో కాంగ్రెస్ నేత దండు రాహుల్‌గుప్తా ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్, సర్దార్‌నగర్ ఏఎంసీ డైరెక్టర్ అక్తర్‌పాషా, నాయకులు దండు మదన్‌గుప్తా, అన్వర్, ఇమ్రాన్, మాజిద్, ఇబ్రహీం, పహిల్వాన్ పాల్గొన్నారు.

కడ్తాల్: స్థానిక మసీద్ కమిటీ అధ్యక్షుడు రాహుఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దశరథ్ నాయక్, మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీనర్సింహ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్ పాల్గొన్నారు. ఇఫ్తార్ మతసామర్యానికి ప్రతీక అన్నారు. నాయకులు జావేద్, జానిమీయా, ఇర్షద్, లాయక్‌అలీ, జహంగీర్, రబ్బాని ఉన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ఆందోళన


సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

ఆమనగల్లు, మార్చి17(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ స్పీకర్ గడ్డ ప్రసాద్‌కుమార్‌ను సూర్యపేట ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డి అవమానించాడని సమావేశాల నుంచి సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ ఆమనగల్లు పట్టణంలో సోమవారం బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పత్యానాయక్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. ఆమనగల్లు పట్టణంలోని హైదరాబాద్- శ్రీశైలం జాతీయ రహదారిపై సీఎం రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేశారు. నాయకులు చుక్క నిరంజన్ గౌడ్, పంతూనాయక్, విజయ్ రెడ్డి, ఈశ్వర్ నాయక్, గుత్తి బాలస్వామి, వెంకటేశ్, రమేశ్‌నాయక్, శివకుమార్, సైదులు గౌడ్, గణేశ్, శ్రీకాంత్, సోమ్లు, మల్యానాయక్, మణిపాల్, మహేశ్, హేమ్లు, నిరంజన్, జంగయ్య, జగన్, శ్రీను నాయక్, గణేశ్ నాయక్ ఉన్నారు.

శంషాబాద్ మున్సిపల్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడిగా రమేశ్


రమేశ్‌కు నియామక పత్రం అందజేస్తున్న విజయ్‌కుమార్

చేవెళ్ల, మార్చి 17, (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ శంషాబాద్ మున్సిపల్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడిగా మంచాల రమేశ్‌ను నియమిస్తున్నట్లు జాతీయ ఎస్సీ కమిషన్ మాజీ సభ్యుడు విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం తన నివాసంలో నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. పార్టీ పటిష్టతకు కృషి చేయాలని కోరారు. అనంతరం రమేశ్ తనకు పదవి రావడానికి కృషి చేసిన రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు జల్‌పల్లి నరేందర్, కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు సంజయ్‌యాదవ్ ధన్యవదాలు తెలిపారు. కార్యక్రమంలో రాచమల్ల జగన్, గణేష్, మహ్మద్ నజీరోద్దీన్, గుంటి ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్‌యాదవ్, అక్రమ్ భాయ్, బాలస్వామి, శ్రీధర్, పాల్సన్, రాజు, దయాకర్, శివకుమార్‌గౌడ్, నరసింహ పాల్గొన్నారు.

సేవలను బట్టే సమాజంలో కీర్తి

కడ్తాల్: సేవలను బట్టే సమాజంలో కీర్తి లభిస్తుందని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు జహంగీర్ అలీ అన్నారు. కడ్తాల మండల కేంద్రంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబలి కేంద్రాన్ని సోమవారం సందర్శించి అంబలి పంపిణీ చేశారు.

పరీక్షలంటే భయం వీడాలి

ఆమనగల్లు: విద్యార్థులు పరీక్షల భయం వీడాలని మాజీ కౌన్సిలర్ చెక్కాల లక్ష్మణ్ అన్నారు. ఆమనగల్లు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం పదో తరగతి విద్యార్థినులకు నిర్వహించిన వీడ్కోలు సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయురాలు విద్యావతమ్మను సన్మానించారు.

ప్రకృతి వ్యవసాయంతోనే ఆరోగ్యం

షాద్‌నగర్ అర్బన్: ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం, ఆదాయం వస్తుందని గ్రీన్ ఫీల్డ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నాగరాజ్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని బూర్గుల గ్రామ రైతులకు సోమవారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. హైబ్రిడ్ వంగడాలు, రసాయనిక ఎరువులు, క్రిమి సంహారక మందులతో పర్యావరణం దెబ్బతింటుందన్నారు.

క్రైం కార్నర్

వైద్యం వికటించి వ్యక్తి మృతి

ఆస్పత్రి ఎదుట బంధువుల ఆందోళన


సామ్యానాయక్(ఫైల్)

షాద్‌నగర్‌రూరల్, మార్చి17(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పట్టణంలోని బాలాజీ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో వైద్యం వికటించి వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. కేశంపేట మండలం కోనాయపల్లి పరిధిలోని లచ్చాతండాకు చెందిన సామ్యానాయక్(50) మూడు రోజుల కింద అనారోగ్యానికి గురి కావడంతో కుటుంబ సభ్యులు బాలాజీ ఆస్పత్రికి తీసుకువచ్చారు. అక్కడ చికిత్స అందిస్తుండగా ఆదివారం రాత్రి పరిస్థితి విషమించి మృతి చెందాడు. అతడి కుటుంబ సభ్యులకు చెప్పకుండా ఆస్పత్రి వర్గాలు అదే రాత్రి షాద్‌నగర్ కమ్యూనిటీ దవాఖానకు తరలించారు. అక్కడికి వెళ్లిన తర్వాత మృతి చెందినట్లు తెలియడంతో కుటుంబ సభ్యులు కోపోద్రిక్తులయ్యారు. బాలాజీ ఆస్పత్రికి చేరుకొని ఆందోళన చేశారు. సోమవారం ఉదయం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఆ సమయంలో కూడా మృతుడి బంధువులు ఆసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. వైద్యం సక్రమంగా చేయడం లేదని, తాము వేరే ఆస్పత్రికి తీసుకెళ్తామని చెప్పినా పట్టించుకోలేదని ఆరోపించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

చేవెళ్ల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): బైక్ పైకి లారీ దుసుకెళ్లడంతో ఓ యువకుడి అక్కడిక్కడే మృతి చెందాడు. ఈ ఘటన చేవెళ్ల పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. చేవెళ్లకు చెందిన బాగిర్తి వెంకటయ్య, సుమిత్రలకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు సాయికుమార్(24) ఉన్నారు. పదో తరగతి వరకు చదువుకున్న సాయికుమార్ తల్లిదండ్రులకు ఆసరాగా ఉండడం కోసం పట్టణ కేంద్రంలోని బైక్‌జోన్‌లో పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం ఇంటి నుంచి పనికి వెళ్లాడు. పనిలో భాగంగా ఖానాపూర్ గేట్ వద్దకు వెళ్లి తిరిగి చేవెళ్లకు వస్తుండగా వికారాబాద్ నుంచి వేగంగా వస్తున్న లారీ ముందు వెళ్తున్న బైక్‌ను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు పోలీస్‌లు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

ఆదిబట్ల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తుర్కయంజాల్ మున్సిపల్ ఏపీ నగర్ వింటేజ్ హోమ్స్‌లో నివాసం ఉంటున్న సౌమ్య వారం క్రితం అమ్మగారింటికి వెళ్లింది. ఆదివారం రాత్రి ఇంటికి వచ్చి చూసేసరికి మెయిన్ డోర్, బెడ్రూంలో ఉన్న అల్మారా పగలగొట్టి ఉంది. అల్మారాలోని సామగ్రి చిందరవందరగా పడి ఉండటంతో దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించింది. సీఐ రాఘవేందర్‌రెడ్డి, ఎస్సై రాజు, క్రైం టీం సభ్యులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. బీరువాలో ఉన్న తులం బంగారం, కిలో వెండి చోరీకి గురైనట్లు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదవశాత్తు అంటుకున్న మంటలు

షాద్‌నగర్‌రూరల్, మార్చి17(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశత్తు ప్లాస్టిక్ చెత్తకు నిప్పు అంటుకోవడంతో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. గతంలో ఉన్న పరిశ్రమలోని ప్లాస్టిక్ చెత్తను పారబోయడం, దానికి నిప్పు అంటుతుకోవడంతో మంటలు వ్యాపించాయి. సమాచారం తెలుసుకున్న అగ్ని మాపక సిబ్బంది మంటలు ఆర్పివేశారు. చుట్టు పక్కల విశాలంగా ఉండటంతో ఎటువంటి ప్రమాదం జరుగలేదు.

చోరీకి పాల్పడిన వ్యక్తి రిమాండ్

మాడ్గుల మార్చి17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొల్కులపల్లి గ్రామ శివారులోని విజయదుర్గా వైన్ షాపులో రెండు నెలల క్రితం దొంగతనం జరిగింది. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసుల దర్యాప్తులో మండలంలోని చౌటకుంట తండాకు చెందిన నేనావత్ సాయికుమార్‌గా గుర్తించారు. చోరీకి పాల్పడిన నిందుతుడిని సోమవారం ఆమనగల్లు కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ వేణుగోపాల్‌రావు తెలిపారు.

కారు, డీసీఎం ఢీ: పలువురికి గాయాలు

కందుకూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): హైద్రాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై కారు డీసీఎంను ఢీకొట్టిన ఘటనలో డీసీఎం బోల్తా పడింది. కారులో ప్రయానిస్తున్న పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన సోమవారం కందుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారి దెబ్బడగూడ గేటు సమీపంలో జరిగింది. కారులో ప్రయాణిస్తున్న వారు నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురితోపాటు డీసీఎం డ్రైవర్‌కు గాయాలయ్యాయి. వారిని నగరంలోని ప్రవేటు ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మరో చోట ఇద్దరికి గాయాలు

కేశంపేట, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఇప్పలపల్లి శివారులో డీసీఎం కారు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. కేశంపేట సీఐ నరహరి తెలిపిన వివరాల ప్రకారం.. కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కొక్కుల కార్తీక్, కొక్కుల కీర్తన్ స్విఫ్ట్ డిజైర్ కారులో ఆదివారం షాద్‌నగర్ ఆసుపత్రికి వెళ్లారు. రాత్రి 10గంటల సమయంలో తిరిగి కొండారెడ్డిపల్లికి వస్తుండగా ఇప్పలపల్లి ఐరన్ పరిశ్రమ వద్ద ఎదురుగా వచ్చిన డీసీఎం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం షాద్‌నగర్ ఆసుపత్రికి తరలించారు. సోమవారం బాధితుడు కొక్కుల కార్తిక్ తండ్రి కొక్కుల కరుణాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో మహిళ ఆత్మహత్య

కేశంపేట, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వేముల్‌నర్వ గ్రామానికి చెందిన వడ్డె అనంత(44) ఆర్థిక ఇబ్బందులతో సోమవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుందని కేశంపేట సీఐ నరహరి తెలిపారు. వడ్డె అనంత భర్త యాదయ్య ఐదేళ్ల కింద మృతి చెందాడు. అప్పటినుంచి కుమారుడు శివకుమార్‌తో కలిసి ఉంటోంది. కొంతకాలంగా అనారోగ్యానికి గురైన అనంతకు ఆర్థిక సమస్యలు ఎదురవడంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి మామా వడ్డె కిష్టయ్య ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నారు.

కుక్కల దాడిలో 11 మేకలు మృతి

షాద్‌నగర్‌రూరల్, మార్చి17(ఆంధ్రజ్యోతి): ఫరూఖ్‌నగర్ మండలం బూర్గుల గ్రామంలో సోమవారం మేకల మందపై వీధి కుక్కలు దాడి చేయడంతో 11 మేకలు మృత్యువాత పడ్డాయి. గ్రామానికి చెందిన కొమ్మగారి రాములు తన మేకలను సాయంత్రం పాకలోకి తోలి ఇంటికి వెళ్లాడు. చుట్టూ ఇనుప జాలి ఉన్నా జాలి కింది నుంచి లోపలికి వెళ్లిన కుక్కలు మేకలపై దాడి చేసి హతమార్చాయి. కేశంపేట మాజీ ఎంపీపీ రవీందర్‌యాదవ్ బాధితుడికి రూ.10 వేలు ఆర్థికసాయం అందించారు.

శంకర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా గోవిందమ్మ

శంకర్‌పల్లి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): శంకర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా గోవిందమ్మను నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. వైస్ చైర్మన్‌గా శంకర్‌పల్లి పట్టణానికి చెందిన చంద్రమోహన్‌తోపాటు మరో 16 మందిని కమిటీ సభ్యులుగా నియమిస్తూ కమిటీని ప్రకటించింది. ఈ సందర్భంగా గోవిందమ్మ మాట్లాడుతూ.. తమపై నమ్మకంతో చైర్‌పర్సన్‌గా అవకాశం కల్పించినందుకు ఎమ్మెల్యే యాదయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. మహాలింగపురం గ్రామానికి చెందిన గోవిందమ్మ శంకర్‌పల్లి జెడ్పీటీసీగా పని చేశారు.